# మళ్లీ రైతుల పోరుబాట

- ఈ నెల 6న ఢిల్లీకి పాదయాత్ర
- తక్కిన రాష్ట్రాల్లో అసెంబ్లీకి మార్చ్
- రైతు సంఘాల నాయకుల ప్రకటన
- అన్నదాతల డిమాండ్లను కేంద్రం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం

చండీగఢ్, డిసెంబర్ 1: కేంద్రం వైఖరికి నిరసనగా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ డిమాండ్ల విషయంలో మోదీ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు మరోసారి కదం తొక్కడానికి సన్నద్ధమయ్యారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని పంజాబ్‌కు చెందిన రైతు నేత శర్వణ్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు. దేశంలోని రైతులందరూ వారి వారి నేతలు, సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రగా ఢిల్లీకి కదిలి రావాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భద్రతా దళాలు ఫిబ్రవరి 13న నిలిపివేయడంతో వారు పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి ప్రాంతాల్లో నిలిచిపోయారని పంధేర్ ఆదివారం మీడియా సమావేశంలో చెప్పారు. శంభు, ఖనౌరిలలో రైతులు 293 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు.

**ఉద్యమ కార్యాచరణ ఇలా..**

రైతుల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరిపై శర్వణ్ సింగ్ మండిపడుతూ శంభు నుంచి దేశ రాజధానికి ర్యాలీ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఉద్యమ కార్యాచరణను వివరించారు. తొలుత రైతులందరూ శంభు వద్ద కలిసి గ్రూప్‌లుగా ఏర్పడాలని, మొదటి గ్రూప్ రైతులకు శత్నాం సింగ్ పన్ను, సురీందర్ సింగ్ చౌతాలా, సుర్జిత్ సింగ్ ఫూల్, బల్జీందర్ సింగ్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ గ్రూప్ తమకు కావాల్సిన నిత్యావసరాలను తీసుకుని ఢిల్లీ వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్లాలన్నారు. రైతులు ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాదయాత్ర కొనసాగిస్తారని, తర్వాత రోడ్డు పక్కన రాత్రుళ్లు గడుపుతారన్నారు. అయితే ఒక్కో గ్రూప్‌లో ఎంతమంది ఉండాలన్న విషయాన్ని తర్వాత తెలియజేస్తామన్నారు. కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాల రైతులు డిసెంబర్ 6న ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రదర్శన నిర్వహించాలని రైతు నేత గుర్మనీత్ కోరారు. కాగా, ఖనౌరి సరిహద్దులో ఎస్‌కేఎం నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించారు.



పాదయాత్ర వివరాలను వెల్లడిస్తున్న రైతు సంఘాల నేతలు

**రైతుల డిమాండ్లివి**

తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**పారిపోతున్న కేంద్రం**

ఈ ఏడాది ఫిబ్రవరి 18 నుంచి రైతులతో కేంద్రం ఎలాంటి చర్చలు జరపలేదని పంధేర్ తెలిపారు. తమ నుంచి కేంద్రం దూరంగా పారిపోతున్నదని ఆరోపించారు. కాంట్రాక్ట్ వ్యవసాయం తమకెంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను తాము కోరుతున్నామన్నారు. ఐదేండ్ల పాటు ధాన్యం, మక్కజొన్న, పత్తి పంటలకు కనీస మద్దతు ధరతో ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తాయని కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్‌లు తమకు ఇచ్చిన హామీలను అప్పుడే తిరస్కరించినట్టు ఆయన చెప్పారు.

## మహారాష్ట్ర సీఎం ఎంపిక నేడు

**శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే**

ముంబై: మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎంపిక నేడు (సోమవారం) జరుగుతుందని శివసేన చీఫ్, ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే చెప్పారు. ఆయన ఆదివారం సతారా జిల్లాలోని తన స్వగ్రామంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధిష్ఠానానికి తాను బేషరతుగా మద్దతిస్తున్నానని చెప్పారు. తదుపరి ముఖ్యమంత్రి అభ్యర్థిని సోమవారం నిర్ణయిస్తారని తెలిపారు. మహాయుతి 2.0 ప్రభుత్వం ఈ నెల 5న ప్రమాణ స్వీకారం చేస్తుందని బీజేపీ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ పేరు ఖరారయిందని బీజేపీ నేత ఒకరు తెలిపారు.



## ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్

**నియమించిన ట్రంప్**

వాషింగ్టన్, డిసెంబర్ 1: అగ్రరాజ్యం అమెరికాలో మరో భారత సంతతి వ్యక్తికి కీలక పదవి లభించింది. శక్తిమంతమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా తన సన్నిహితుడు కాష్ పటేల్‌ను అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. 'తదుపరి ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్ బాధ్యతలు చేపడతారని గర్వంగా ప్రకటిస్తున్నా. కాష్ ఎంతో తెలివైన న్యాయవాది, పరిశోధకుడు. అవినీతిపై పోరాటం, దేశ ప్రజల రక్షణ కోసం తన కెరీర్‌లో ఎక్కువ కాలం వెచ్చించిన పోరాటయోధుడు' అని ట్రంప్ ఎక్స్‌లో ప్రశంసించారు. 44 ఏండ్ల పటేల్ 2017లో ట్రంప్ హయాంలో యునైటెడ్ స్టేట్స్ సెక్రటరీ ఆఫ్ డిఫెన్స్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరించారు.

## కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

**ఢిల్లీ ఎన్నికలపై కేజ్రీవాల్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: ఫిబ్రవరిలో జరగనున్న ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో తమ పార్టీకి పొత్తు ఉండదని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. 'ఢిల్లీలో ఎలాంటి పొత్తు ఉండదు' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఆప్, కాంగ్రెస్ ఈ ఏడాది మొదట్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కలిసి పోటీ చేశాయి. అయితే అక్కడ మొత్తం స్థానాలు బీజేపీ గెలుచుకోవడంతో ఈ రెండు పార్టీలు ఓటమి చవి చూశాయి. అక్టోబర్‌లో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకంపై ఇరు పార్టీలు పలు దఫాలు చర్చలు జరిపినా ఒక ఒప్పందానికి రాలేకపోయాయి.

## దంపతులు కనీసం ముగ్గుర్ని కనాలి

**ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్**

నాగ్‌పూర్: జనాభా వృద్ధి రేటు తగ్గిపోతుండటం పట్ల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భాగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. దంపతులు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని చెప్పారు. నాగ్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ, మన దేశంలో జనాభా తగ్గుతుండటం ఆందోళనకరమని తెలిపారు. జనాభా వృద్ధి రేటు 2.1 కన్నా తగ్గితే, ఆ సమాజం నాశనమవుతుందనివివరించారు. ఈ సమస్య కారణంగానే అనేక భాషలు, సంస్కృతులు అంతరించిపోయాయని తెలిపారు. కాగా, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2021లో వెల్లడించిన వివరాల ప్రకారం, మన దేశంలో ఫెర్టిలిటీ రేటు 2.2 నుంచి 2కు తగ్గిపోయింది.



## బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్‌గా జైతీర్థ్ బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి బ్రహ్మోస్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు.ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధిలో డాక్టర్ జోషి విశేష కృషి చేశారు. లాంగ్ రేంజ్ సర్ఫేస్ టూ ఎయిర్ మిస్సైల్ డెవలప్‌మెంట్ కోసం ఆర్ అండ్ డీకి నాయకత్వం వహించారు. అధునాతన క్షిపణుల తయారీలో మూడు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు.

## క్యాన్సర్ పనిపట్టే 'బంగారు' ఔషధం!

**అభివృద్ధి చేసిన ఆస్ట్రేలియా వర్సిటీ, భారత పరిశోధన సంస్థలు**




న్యూఢిల్లీ, డిసెంబర్ 1: కొన్ని రకాల మొండి వ్యాధులకు ఆయుర్వేద వైద్య చికిత్సలో బంగారాన్ని(ఔషధాల్లో) వాడటమన్నది మన దేశంలో ఎన్నో వేల ఏండ్ల క్రితమే ఉంది. క్యాన్సర్ కణతులను అరికట్టడంలో 'బంగారం' విశిష్ట లక్షణాల్ని కలిగి ఉందని సైంటిస్టులు కూడా చెబుతున్నారు. 'యూరోపియన్ జర్నల్ ఆఫ్ మెడిసినల్ కెమిస్ట్రీ' నివేదిక ప్రకారం, క్యాన్సర్ కణతులపై కీమోథెరపీ కన్నా బంగారాన్ని కలిపిన ఔషధ చికిత్స మెరుగైన ఫలితాల్ని ఇచ్చినట్టు ఆస్ట్రేలియాకు చెందిన 'ఆర్ఎంఐటీ' వర్సిటీ, భారతీయ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీళ్లు తయారుచేసిన బంగారంతో కూడిన ఔషధం, జంతువుల్లో ట్యూమర్(క్యాన్సర్ కణతి) పెరుగుదలను 82 శాతం వరకు అడ్డుకోగలిగింది. గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో 'సిస్ప్లాటిన్'ను కీమోథెరపీ డ్రగ్‌గా వాడుతారు. దీంతో పోల్చితే బంగారాన్ని కలిపిన ఔషధం 27 రెట్లు మెరుగ్గా పనిచేసింది. క్యాన్సర్ కణాల పెరుగుదలను 'సిస్ప్లాటిన్' 29 శాతం అడ్డుకోగా, బంగారంతో కూడిన ఔషధం 82 శాతం వరకు అడ్డుకుంది.

**విశిష్ట లక్షణాలే కారణం**

శుద్ధమైన బంగారంలోని రసాయన సమ్మేళనానికి స్థిరత్వం ఎక్కువ. ఈ విశిష్ట లక్షణంతో క్యాన్సర్ చికిత్సలో ఎదురవుతున్న ఔషధ నిరోధకత సమస్యను పరిష్కరించవచ్చునని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రొస్టేట్ క్యాన్సర్‌కు కీమోథెరపీ డ్రగ్‌గా 'ఫిబ్రోసాఅర్కోమా'ను విరివిగా వాడతారు. అయితే క్యాన్సర్ కణాల్లో రానురాను ఔషధ నిరోధకత పెరిగింది. 'ఫిబ్రోసాఅర్కోమా'కు బదులు బంగారాన్ని కలిపిన ఔషధం వాడగా.. 7.5 రెట్లు మెరుగైన ఫలితం వచ్చిందని నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ చికిత్సలో 'ప్లాటినం' ఆధారిత డ్రగ్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా 'బంగారం'తో కూడిన ఔషధ చికిత్సను అభివృద్ధి చేయటంలో తాజా పరిశోధన కీలకమైన ముందడుగుగా నివేదిక పేర్కొన్నది.

## మరణాన్ని ముందే చెప్పే 'డెత్ క్లాక్'

వాషింగ్టన్, డిసెంబర్ 1: ప్రాణమున్న జీవులకు మరణం తప్పనిసరి. మనలో చాలా మందికి మనం చనిపోయే రోజేదో తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటుంది. ఈ విషయం తెలుసుకోవడానికి శతాబ్దాలుగా మనుషులు వివిధ జీవ కొలమాన పట్టికల ద్వారా ప్రయత్నిస్తూనే ఉన్నారు. కానీ ఇప్పుడు కృత్రిమ మేధ(ఏఐ) ఆ లక్ష్యాన్ని స్వీకరించింది. ఏఐ సాయంతో పని చేసే 'డెత్ క్లాక్' యాప్ ఈ విషయంలో బాగా ప్రాచుర్యం పొందింది. అయితే కేవలం డబ్బు చెల్లించే యూజర్లే దీని సేవలు పొందవచ్చు. జూలైలో ఆవిష్కరించిన ఈ యాప్ ఇప్పటి వరకు 1.25 లక్షల సార్లు డౌన్‌లోడ్ అయ్యిందని బ్లూమ్‌బర్గ్ తాజా నివేదిక పేర్కొంది. బ్రెంట్ ఫ్రాన్సన్ ఈ యాప్‌ను రూపొందించారు. 1200 జీవిత కాల అధ్యయనాలపై ఈ యాప్‌లోని ఏఐకు శిక్షణ ఇచ్చారు.



**ఎలా పని చేస్తుంది?**

ఆహారం, వ్యాయామం, ఒత్తిడి స్థాయిలు, నిద్ర వంటి సమాచారాన్ని ఉపయోగించి మరణ తేదీపై ఈ యాప్ జోస్యం చెప్తుంది. ప్రామాణిక జీవిత కాల అంచనా పట్టికలపై ఈ యాప్ వెలువరించిన ఫలితాలు మెరుగ్గా ఉన్నాయని ఫ్రాన్సన్ తెలిపారు. ఆరోగ్యం, దారుఢ్యం విభాగాల యాప్‌లలో ఈ యాప్ టాప్ ర్యాంక్‌లో ఉంది. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలనుకొనేవారు ఏడాదికి రూ.3 వేల (40 డాలర్లు) దాకా చెల్లించాల్సి ఉంటుంది. మరణాన్ని కొంత కాలం ఆపగలిగేలా జీవన శైలిలో చేసుకోవాల్సిన మార్పులను డెత్ క్లాక్ యాప్ సూచిస్తుంది. మన మిగిలిన జీవిత కాలపు కౌంట్ డౌన్‌ను ఈ యాప్ చూపిస్తుంది. 'మీ జీవితంలో మీరు చనిపోయే రోజు కన్నా అతి ముఖ్యమైన రోజు బహుశా ఉండకపోవచ్చు' అని ఫ్రాన్సన్ తెలిపారు.

## మేడమ్ ఈజ్ బిజీ!

- నన్ను సోనియాగాంధీ ఫోన్లో గంట సేపు నిరీక్షింప చేశారు
- పాత తరం ఫీడ్ బ్యాక్ తీసుకోని నాటి నుంచి 'హస్తం' పతనం
- ఆత్మకథలో వెల్లడించిన కాంగ్రెస్ మాజీ నేత నజ్మా హెప్తుల్లా



*న్యూఢిల్లీ, డిసెంబర్ 1: తాను 1999లో ఇంటర్–పార్లమెంటరీ యూనియన్(ఐపీయూ) అధ్యక్షురాలిగా ఎన్నికైనప్పుడు సోనియా గాంధీకి బెర్లిన్ నుంచి ఆ విషయం చెప్పాలని ఫోన్ చేస్తే గంట సేపు నిరీక్షించేలా చేశారని ఆ పార్టీ మాజీ నేత నజ్మా హెప్తుల్లా తెలిపారు. సోనియా సిబ్బంది ఒకరు మేడమ్ బిజీగా ఉన్నారని తనకు బదులిచ్చారని ఆమె వెల్లడించారు. రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన నజ్మా హెప్తుల్లా 2004లో సోనియా గాంధీతో విభేదాల కారణంగా బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌లో తనకెదురైన పలు అనుభవాలను ఆమె తాజాగా విడుదల చేసిన తన ఆత్మకథ 'ఇన్ పర్సూట్ ఆఫ్ డెమొక్రసీ: బియాండ్ పార్టీ లైన్స్' పుస్తకంలో పేర్కొన్నారు. ఐపీయూ అధ్యక్ష పదవికి ఎన్నికై, తాను భారత పార్లమెంట్ నుంచి మొదటిసారి ప్రపంచ పార్లమెంటరీ వేదిక పైకి అడుగు పెట్టడం చరిత్రాత్మకం అని ఆమె అన్నారు. ఈ విషయం గురించి మొదట తాను నాటి ప్రధాని వాజ్‌పేయికి ఫోన్ చేసి తెలుపగానే ఆయన సంతోషించారని..'మీరు తిరిగి రండి.. మనం సంబరాలు చేసుకుందాం' అని అన్నారని ఆమె తెలిపారు. అప్పటి తన పార్టీ నాయకురాలు సోనియాకు ఈ విషయమై ఫోన్ చేస్తే తాను గంట సేపు నిరీక్షించినా ఆమె లైన్‌లోకి రాలేదన్నారు. దాంతో తాను నిజంగా ఎంతో నిరాశ చెందానన్నారు. 'ఏదేమైనా ఆ ఘటన ముందస్తుగా నిరూపితమైన ఒక తిరస్కరణ. కాంగ్రెస్‌లోని పాత తరం, అనుభవజ్ఞులకు సంక్షోభ కాలం. పార్టీ కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన వారిని నిరాశ పరిచి భ్రష్టు పట్టించిన సమయం. అనుభవం లేని, భజన చేసే కొత్త కోటరీ పార్టీ కార్యకలాపాలను నిర్వహించడం ప్రారంభించారు' అని నజ్మా విమర్శించారు. పార్టీ పనితీరుకు కీలకమైన ఫీడ్ బ్యాక్ ఇవ్వడంలో తన లాంటి వారికి ఎలాంటి చురుకైన పాత్ర లేకుండా పోయిందని.. ఆ నాటి నుంచి పార్టీ పతనం ప్రారంభమైందని ఆమె వెల్లడించారు. 'చాలా దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో వెల్లివిరిసిన సహకార సూత్రాల భావనకు వ్యతిరేకంగా ఆమె ప్రవర్తన ఉండేది' అని నజ్మా హెప్తుల్లా అన్నారు.*

## వాణిజ్య సిలిండర్‌పై మళ్లీ బాదుడు

- రూ.16.5 వడ్డించిన కేంద్రం
- వరుసగా ఐదో నెలా ధర పెంపు
- 5 నెలల్లో రూ.172 పెరిగిన ధర



న్యూఢిల్లీ, డిసెంబర్ 1: వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ పెరిగింది. కమర్షియల్ సిలిండర్‌పై రూ.16.50 పెంచుతూ చమురు సంస్థలు ఆదివారం నిర్ణయించాయి. దీంతో హైదరాబాద్‌లో దీని ధర రూ.2066కి చేరింది. ఈ సిలిండర్ ధర పెరగడం వరుసగా ఇది ఐదో నెల. మొత్తంగా ఈ అయిదు నెలల్లో ఈ సిలిండర్ ధర రూ.172.50 పెరిగింది. ఒక ఏడాది కాలంలో సిలిండర్ ధరలు ప్రస్తుతం అత్యధిక స్థాయికి చేరాయి. మరోవైపు, విమాన ఇంధనం ధర కిలో లీటర్‌కు రూ.1318.12 (1.45 శాతం) పెరిగింది. దేశ రాజధానిలో ప్రస్తుతం ఈ ఇంధనం ధర రూ.91,856.84కు చేరుకుంది. ఈ ఇంధనం ధర వరుసగా రెండో నెల పెరిగింది. ఇండ్లలో వాడే వంటగ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

## సెక్స్ వర్కర్లకు పెన్షన్లు, ప్రసూతి సెలవులు

**చట్టాన్ని తీసుకొచ్చిన బెల్జియం**

*పారిస్, డిసెంబర్ 1: ఇతర వృత్తుల్లో ఉన్నవారితో సమానంగా సెక్స్ వర్కర్లకు కూడా కార్మిక హక్కులను వర్తింపజేస్తూ యూరప్ దేశం 'బెల్జియం' విప్లవాత్మకమైన చట్టాన్ని తీసుకొచ్చింది. సెక్స్ వర్కర్లకు ఆరోగ్య బీమా, ప్రసూతి సెలవులు, పెన్షన్లు.. అమలు జేయాలని పేర్కొంటూ ఆ దేశం చేసిన చట్టం ఆదివారం(డిసెంబర్ 1) నుంచి అమల్లోకి వచ్చింది. ఉపాధి పొందే హక్కు సహా సామాజిక, కార్మిక హక్కులను గుర్తిస్తూ.. ప్రపంచంలోనే ఈ తరహా చట్టాన్ని చేసిన మొదటి దేశంగా బెల్జియం నిలిచింది. 'సెక్స్ వర్క్' నేరం కాదని 2022లోనే పేర్కొన్న బెల్జియం, తాజా చట్టంతో ఇతర వృత్తులకు సమానంగా సామాజిక, కార్మిక హక్కుల్ని వారికి కల్పించింది. దీంతో ఇకపై ఏజెన్సీలు(యాజమాన్యాలు) వారికి ఆరోగ్య, జీవిత బీమా, ప్రసూతి సెలవులు, సిక్ హాలిడేస్.. మొదలైనవి అమలుజేయాల్సి ఉంటుంది. బెల్జియం తీసుకొచ్చిన చట్టంపై హ్యూమన్ రైట్స్ వాచ్ పరిశోధకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సెక్స్ వర్క్‌లో ఉండే దోపిడీ, మానవ అక్రమ రవాణా, వేధింపులను ఈ చట్టం అడ్డుకోలేదని కొంత మంది విమర్శకులు హెచ్చరించారు.*

# సిరియాలో మళ్లీ సంక్షోభం

- భీకర దాడులకు దిగిన ఇస్లామిక్ రెబల్స్
- అలెప్పోలోని పలు కీలక ప్రాంతాలు స్వాధీనం
- బషర్ సేనలకు అండగా నిలిచిన రష్యా
- వైమానిక దాడుల్లో 300 మందికిపైగా హతం

న్యూఢిల్లీ, డిసెంబర్ 1: అంతర్యుద్ధంతో దాదాపు దశాబ్ద కాలంపాటు అట్టుడికిన సిరియాలో మళ్లీ సంక్షోభం మొదలైంది. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదాకు అనుబంధంగా పనిచేస్తున్న 'హయత్ తహ్రీర్ అల్–షామ్' ఇస్లామిక్ గ్రూపునకు చెందిన సాయుధ తిరుగుబాటుదారులు సిరియాలో రెండవ అతిపెద్ద నగరమైన అలెప్పోలో భీకర దాడులకు దిగారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఈ దాడుల్లో సిరియా అధ్యక్షుడు బషర్ అల్–అసద్ నేతృత్వంలోని ప్రభుత్వ సేనలను వెనక్కి నెడుతూ అలెప్పో విమానాశ్రయంతోపాటు ఆ నగరంలో సగానికిపైగా ప్రాంతాన్ని, ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోని మరాత్ అల్ నమన్ నగరాన్ని, అనేక పట్టణాలను, గ్రామాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో సిరియా ప్రభుత్వ దళాలకు రష్యా అండగా నిలిచింది. తిరుగుబాటుదారులపై భీకర స్థాయిలో వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 300 మందికిపైగా తిరుగుబాటుదారులు హతమయ్యారని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది.

**అసద్ వ్యతిరేక నిరసనలతో మొదలై..**

2011లో కొందరు ప్రజాస్వామ్య అనుకూలవాదులు సిరియా అధ్యక్షుడు బషర్–అల్–అసద్ గద్దె దిగాలంటూ వీధులలో ప్రదర్శనలను చేశారు. ఈ అంతర్యుద్ధాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న అసద్ ప్రభుత్వ దళాలు వారి ఉద్యమాన్ని నిరంకుశంగా అణచివేశాయి. అయితే చిన్న ఆర్గానిక్ మిలీషియాలు, సిరియన్ మిలిటరీ నుంచి వచ్చిన కొందరితో కలిసి ఒక సాయుధ ప్రతిపక్షం ఏర్పడటం ప్రారంభించింది. అయితే ఈ సంస్థల ఆలోచనలు, వ్యూహాలు భిన్నంగా ఉన్నప్పటికీ అసద్‌ను దించేయాలన్న ఏకైక లక్ష్యం వారిని ఒక్కటి చేసింది. దానికి తోడు వీరికి పొరుగున ఉన్న టర్కీ, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో పాటు అమెరికా కూడా వివిధ మార్గాల్లో సహకారం అందించేవి. వీరి కార్యకలాపాలు పెరుగుతుండటంలో అప్రమత్తమైన సిరియా.. రష్యా, ఇరాన్ లాంటి మిత్ర దేశాలతో బంధం మరింత బలోపేతం చేసుకుంది. సహజంగానే జిహాదీల ప్రమేయాన్ని సిరియా ఇష్టపడేది కాదు. దాంతో ఇస్లామిక్ సంస్థలు ఆ దేశాన్ని టార్గెట్ చేయడం ప్రారంభించాయి. 2014 నాటికి తిరుగుబాటుదారులు దేశంలోని పలు ప్రాంతాలను ఆక్రమించడం ప్రారంభించారు. 2016 నాటికి రష్యా, ఇరాన్ మద్దతుతో సైనిక తిరుగుబాటుదారులను సిరియా పూర్తిగా అణచివేసి అలెప్పో నగరాన్ని స్వాధీనం చేసుకుంది.



అలెప్పోలో సిరియా యుద్ధ ట్యాంక్‌ను స్వాధీనం చేసుకున్న తిరుగుబాటుదారులు

**అదును చూసి..**

సిరియా మిత్ర దేశాలైన రష్యా, ఇరాన్ ప్రస్తుతం యుద్ధాల్లో నిమగ్నమైనందున అవి సిరియాకు సాయం చేయకపోవచ్చని భావించిన 'హయత్ తహ్రీర్ అల్–షామ్ గ్రూప్ తిరిగి దాడులు ప్రారంభించినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఈవీఎంను హ్యాక్ చేస్తానన్న వ్యక్తిపై కేసు

ముంబై: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) ఫ్రీక్వెన్సీని ఐసొలేట్ చేయడం ద్వారా ఆ యంత్రాన్ని హ్యాక్ చేస్తానని చెప్పిన సయ్యద్ షుజపై ఎన్నికల సంఘం (ఈసీ) ఫిర్యాదు మేరకు ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సయ్యద్ చెప్తున్న మాటలు తప్పు, నిరాధారం అని ఫిర్యాదులో సీఈఓ పేర్కొన్నారు. సయ్యద్ 2019లో కూడా ఇదేవిధంగా నిరాధారమైన ప్రచారం చేశాడని, ఈసీ ఆదేశాల మేరకు అతనిపై అప్పట్లో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. సయ్యద్ విదేశాల్లో ఉంటూ ఇటువంటి ఆరోపణలు చేస్తున్నట్లు చెప్పారు. ఈవీఎంలను ఏదైనా నెట్‌వర్క్‌తో కనెక్ట్ చేయడం సాధ్యం కాదని ఈసీ స్పష్టం చేసింది.

## డాలర్‌ను కాదంటే సుంకాల మోతే

**బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక**

వాషింగ్టన్: అమెరికా డాలర్ స్థానాన్ని భర్తీ చేయడం కోసం బ్రిక్స్ దేశాలు కొత్త కరెన్సీ సృష్టించేందుకు ప్రయత్నించినా లేదా ఇతర కరెన్సీకి మద్దతు తెలిపినా వంద శాతం సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని యూఎస్ తదుపరి అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆ దేశాలు అలాంటి ప్రయత్నాలు చేస్తే అద్భుతమైన అమెరికా ఆర్థిక వ్యవస్థలో వస్తువులు అమ్ముకోవడానికి వీడ్కోలు చెప్పాల్సి వస్తుందని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు.

## ఐక్యూలో ఐన్‌స్టీన్‌ను మించిన బ్రిటిష్ ఇండియన్ బుడతడు

లండన్: ఇండియన్ – బ్రిటిష్ బాలుడు క్రిష్ అరోరా (10) మేధాశక్తిలో రికార్డు సృష్టించాడు. ఐక్యూ స్కోర్ 162 సాధించి, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌లను మించిపోయాడు. దీంతో ప్రపంచంలోని 1 శాతం అత్యంత మేధావుల సరసన చేరిపోయాడు. అంతేకాకుండా, అత్యంత మేధావుల సొసైటీ మెన్సాలోకి ప్రవేశించాడు. బ్రిటన్‌లో గొప్ప పేరు, ప్రతిష్ఠలున్న క్వీన్ ఎలిజబెత్స్ స్కూల్‌లో సెప్టెంబరులో చేరబోతున్నాడు. క్రిష్ మాట్లాడుతూ కొత్త పాఠశాల తన సత్తాకు మెరుగైన సవాళ్లను విసురుతుందని ఆశిస్తున్నానని తెలిపాడు.

# పెనుముప్పుగా అంతరిక్ష వ్యర్థాలు

**ఉపగ్రహ వ్యర్థాలతో అంతరిక్షం చెత్తకుప్పలా మారుతున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్), ఇతర ఉపగ్రహాలకు ఈ రోదసి వ్యర్థాలు పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. వారం వ్యవధిలోనే (నవంబర్ 19, నవంబర్ 25) ఐఎస్ఎస్‌కు రెండు సార్లు వీటి నుంచి ప్రమాదం తప్పిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.**

–నేషనల్ డెస్క్

- వారం వ్యవధిలోనే ఐఎస్ఎస్‌కు రెండుసార్లు తప్పిన ప్రమాదం
- రోదసి వ్యర్థాలతో కాస్మిక్ డంప్‌యార్డుగా మారిన భూ దిగువ కక్ష్య
- సరైన నిబంధనలు లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నిర్లక్ష్యం



*ప్రస్తుతం భూ దిగువ కక్ష్యలో 10 వేలకు పైగా క్రియాశీల ఉపగ్రహాలు ఉన్నాయి. 2030 నాటికి వీటి సంఖ్య లక్షకు చేరవచ్చని అంచనా. దీంతో అంతరిక్షంలోనూ ట్రాఫిక్ జామ్ తలెత్తే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో కాలం చెల్లిన శాటిలైట్లు, రాకెట్ల విడిభాగాలు, స్పేస్‌క్రాఫ్ట్‌ల శిథిలాలతో భూ దిగువ కక్ష్య 'కాస్మిక్ స్క్రాప్‌యార్డ్'గా మారింది. ఈ అంతరిక్ష వ్యర్థాలు గంటకు సుమారు 18,000 మైళ్ల వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదకరంగా మారాయి. ఈ వేగం బుల్లెట్ స్పీడ్ కంటే ఏడు రెట్లు ఎక్కువ. దీంతో ఈ వ్యర్థాలు భవిష్యత్తు అంతరిక్ష ప్రయోగాలకు, శాటిలైట్లకు ప్రమాదకరంగా మారాయి. సూర్యుని నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాలను 99 శాతం వరకు ఓజోన్ పొర అడ్డుకుంటుంది. మానవులు ప్రయోగిస్తున్న ఉపగ్రహాల వల్ల వచ్చే కాలుష్యం ఈ ఓజోన్ పొరను దెబ్బతీస్తుంది.*

- *2007లో తాను ప్రయోగించిన ఫెన్‌గ్యూన్–1ను చైనా నాశనం చేయడంతో అంతరిక్షంలో వ్యర్థాలు భారీగా పెరిగాయి. 2009లో రష్యాకు చెందిన అనియంత్రిత శాటిలైట్ (కాస్మోస్–2251), అమెరికాకు చెందిన ఇరిడియం 33 కమ్యూనికేషన్ శాటిలైట్‌ను ఢీకొనడంతో ఈ వ్యర్థాలు మరింత పెరిగాయి.*

***నిర్వహణ ఏదీ?***

*అంతరిక్ష వ్యర్థాల నిర్వహణపై ఎటువంటి నిబంధనలు లేనందువల్ల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. భూ దిగువ కక్ష్య ఇప్పుడు ప్రపంచంలో అతి పెద్ద చెత్త డంప్‌యార్డుగా మారిందని నాసా అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. అలాంటపుడు దీనిని ఎందుకు తొలగించడం లేదు? అనే ప్రశ్న ఎదురవుతుంది. దానికి సమాధానం ఒకటే. అంతరిక్ష యానం చాలా ఖరీదైనది, చెల్లాచెదురుగా పడిన చెత్తను ఏరడం అంత సులువు కాదు.*

**అంతరిక్ష వ్యర్థాల్లో దేశాల వారీగా వాటా**

| | |
|---|---|
| అమెరికా | 40% |
| రష్యా | 28% |
| చైనా | 19% |
| భారత్ | 0.8% |

**రోదసి వ్యర్థాలు ఇలా..**

- 10 సెంటీమీటర్ల కన్నా పెద్దవి– 29 వేలు
- 1మి.మీ కన్నా పెద్దవి– 17,00,00,000
- ప్రయాణించే వేగం– గంటకు 18000 మైళ్లు
- ఏ పరిమాణంలోని ముక్కలు ఐఎస్ఎస్ రక్షణ వ్యవస్థను చొచ్చుకుపోగలవు – 1 సెంటీమీటర్‌పైన